www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 31 మే 2024

5

ఏలూరు



గ్రూప్-2 మెయిన్ పరీక్షకు ఉచిత శిక్షణ

ఏలూరు : జులై 28వ తేదీన జరిగే గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు సిద్ధమవుతున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీకి సంబంధించిన అర్హులైన అభ్యర్థులకు బిసి స్టడీ సర్కిల్‌లో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష సిద్ధమయ్యే విద్యార్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులతో పాటు ప్రతిరోజు సబ్జెక్టుకి సంబంధించిన ప్రాక్టీస్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. లైబ్రరీ సౌకర్యం, స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉన్నాయని, స్టయిఫండ్, బుక్స్, అలవెన్సు వంటి సౌకర్యాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీకి సంబంధించిన అభ్యర్థులు ఈ పోటీ పరీక్షల్లో శిక్షణ పొందేందుకు బిసి స్టడీ సర్కిల్, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంగ్లీష్ మీడియం యుపి స్కూల్, వెన్నవల్లివారి పేటలో సంప్రదించాలని లేదా 9912394799, 8341991001 సంప్రదించాలని తెలిపారు.

కౌంటింగ్.. ఫీవర్..!



- మరో 4 రోజుల్లో ఓట్ల లెక్కింపు
- అభ్యర్థులు, పందెంరాయుళ్లు, కార్యకర్తల్లో టెన్షన్
- రెండు జిల్లాల్లోనూ రూ.కోట్లలో బెట్టింగ్
- పైకి ధీమాగా ఉన్నా ఫలితాలపై లోలోన ఆందోళన
- గడిచిన 17 రోజులుగా పోలింగ్‌పై రకరకాల లెక్కలు
- ప్రభుత్వ ఏర్పాటులో జిల్లా ఈసారి కీలకమవుతుందా?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల కౌంటింగ్ ఫీవర్ అందరినీ చుట్టేస్తోంది. ఓట్ల లెక్కింపునకు మరో నాలుగు రోజులు మాత్రమే సమయం ఉండటంతో ఏ ఇద్దరిని కలిసినా దీనిపైనే చర్చ సాగుతోంది. ఏ స్థానంలో ఎవరు గెలుస్తారు.. ఏ అభ్యర్థికి ఎంత మెజార్టీ వస్తోంది. హోరాహోరీగా సాగిన స్థానాల్లో ఏ అభ్యర్థికి అవకాశం ఉంటుంది. ఇలా అనేక రకాల చర్చలు జనాల్లో సాగుతున్నాయి. మే 13న పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత అభ్యర్థులు, కార్యకర్తలంతా సేదతీరుతూ కొంత ఉపశమనం పొందినట్లు కన్పించారు. కౌంటింగ్ ప్రక్రియ దగ్గర పడుతుండటంతో అభ్యర్థులతోపాటు పందెంరాయుళ్లు, ఆయా పార్టీల కార్యకర్తల్లోనూ మళ్లీ హైటెన్షన్ నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. జూన్ నాలుగో తేదీన జరిగే ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ప్రతి నియోజకవర్గానికీ 14 టేబుల్స్ వరకూ ఏర్పాటు చేస్తున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించి, అనంతరం ఇవిఎంల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. పోలైన ఓట్లను బట్టి ప్రతి నియోజకవర్గానికి సంబంధించి 16 నుంచి 21 రౌండ్లలో స్పష్టమైన ఫలితం వెల్లడి కానుంది. నాలుగైదు రౌండ్లలో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారో చాలావరకూ తెలిసే అవకాశం ఉందని అంచనాలు వేస్తున్నారు. ఫలితాలపై నిన్నమొన్నటి వరకూ ధీమాగా ఉన్న నాయకులు, కార్యకర్తలంతా ఓట్ల లెక్కింపు దగ్గర పడుతున్న కొద్దీ తీవ్ర ఆందోళనకు గురవుతున్న పరిస్థితులు కన్పిస్తున్నాయి. చాలామంది నాయకులు, కార్యకర్తలు టెన్షన్ తట్టుకోలేకపోతున్నామంటూ చెబుతున్నారు. రెండు జిల్లాల్లోనూ ప్రతి నియోజకవర్గ పరిధిలోనూ రూ.కోట్లలో బెట్టింగ్ జరిగింది. అభ్యర్థుల గెలుపు, మెజార్టీ, గ్రామాలవారీగా మెజార్టీ ఇలా అనేక రూపాల్లో పందేల జోరు సాగింది. కౌంటింగ్ ప్రకియ దగ్గర పడుతుండటంతో పందెంరాయుళ్లలో టెన్షన్ తారాస్థాయికి చేరుతోంది. ఏం జరుగుతుందోననే ఆందోళన కన్పిస్తోంది. ముఖ్యంగా ఆచంట, ఉండి, దెందులూరు, నూజివీడు వంటి నియోజకవర్గాల్లో ఎన్నికల పోరు మరింత హోరాహోరీగా సాగింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారు.. మెజార్టీ ఎంత వస్తుందనే చర్చ తీవ్రంగా నడుస్తోంది. తెలిసిన వారందరికీ ఫోన్లు చేసి అభ్యర్థి గెలుపుపై ఆరా తీస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. దాదాపు గడిచిన మూడు వారాలుగా అభ్యర్థులు, కార్యకర్తలంతా పోలింగ్ సరళిపై వేయని లెక్కలు లేవు. గ్రామాలవారీగా, సామాజిక తరగతులవారీగా ఓట్ల తీరుపై సైతం లెక్కలు వేశారు. అయినప్పటికీ లోలోన ఆందోళన మాత్రం ప్రధాన పార్టీలకు చెందిన నాయకులను వెంటాడుతోంది. పెరిగిన ఓటింగ్ ఎవరికి లాభ పడుతుందోననే భయం అందరినీ పీడిస్తోంది.

ప్రభుత్వ ఏర్పాటులో ఉమ్మడి జిల్లా మళ్లీ కీలకం అవుతుందా?

భయగోదావరి జిల్లాల్లో ఎన్నికల సరళి మిగిలిన జిల్లాలకు భిన్నంగా ఉంటుందని చెప్పొచ్చు. ఎన్నికల్లో ఏదోక పార్టీని గంపగుత్తగా గెలిపించడం ఈ జిల్లాల్లో ఒరవడిగా కొనసాగుతోంది. గడిచిన రెండు సాధారణ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే ఈవిషయం అందరికీ అర్థమవుతోంది. 2014లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాల్లో టిడిపి, బిజెపి అభ్యర్థులను ఇక్కడి ప్రజలు గెలిపించారు. తూర్పుగోదావరి జిల్లాలోనూ అత్యధిక స్థానాలు టిడిపి గెలుచుకుంది. దీంతో రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం వంటి జిల్లాల్లోనూ వైసిపికి అత్యధిక స్థానాలు వచ్చినా ఉభయగోదావరి జిల్లాలో వచ్చిన ఎక్కువ సీట్లే అప్పట్లో టిడిపి ప్రభుత్వ ఏర్పాటుకు కీలకంగా మారాయి. 2019లో జరిగిన ఎన్నికల్లో 15 స్థానాలకుగాను 13 స్థానాలతోపాటు, రెండు ఎంపీ స్థానాల్లోని వైసిపి అభ్యర్థులనే ఇక్కడి ప్రజలు గెలిపించారు. తూర్పుగోదావరి జిల్లాలోనూ అదే పరిస్థితి కొనసాగింది. దీంతో వైసిపికి భారీ మెజార్టీ వచ్చిపడింది. ఈసారి ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. దీంతో ఏ పార్టీకి ఎన్ని సీట్లు అనేదానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈసారి ప్రభుత్వ ఏర్పాటులోనూ జిల్లాలోని స్థానాలు కీలకంగా మారనున్నాయా అనే చర్చ సాగుతోంది. దీంతో జిల్లాలోని స్థానాలపై ఎవరి లెక్కలు వారు వేసుకుంటూ అంచనాలు కడుతున్నారు.

ఉన్మాది ఘాతుకం

యువతి పీక కోసి హత్య - ఆపై తానూ కోసుకుని ఆత్మహత్యాయత్నం


హత్యకు గురైన యువతి, పక్కనే ఉన్మాది

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

'ఇటీవలే నిశ్చితార్థమైంది. త్వరలోనే వైవాహిక జీవితంలో అడుగుపెట్టి మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలనే ఆ యువతి ఆకాంక్షలను ఉన్మాది చిదిమేశాడు. తాను పని చేస్తున్న విద్యాసంస్థలో తనతోపాటు ఫ్యాకల్టీగా పని చేస్తున్న యువకునితో యువతికి వివాహం కుదిరింది. ఈ నెల 26నే నిశ్చితార్థమైంది. ఈ క్రమంలో బ్యాంకు పని నిమిత్తం గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికొచ్చిన ఆ యువతిపై గతంలో ప్రేమ పేరుతో వెంట పడిన యువకుడు హఠాత్తుగా దాడి చేసి పీక కోసేశాడు. ఆమె రక్తపు మడుగులో గిలగిలా కొట్టుకుంటుంటే తాను కూడా పీక కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చేటప్పటికే యువతి మృతి చెందింది. పోలీసులు అక్కడికి హుటాహుటీన చేరుకుని తీవ్ర గాయాలతో పడి ఉన్న ఉన్మాదిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన ఏలూరు నగరంలో తీవ్ర కలకలం సృష్టించింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.


రత్నగ్రేస్ (ఫైల్‌ఫొటో)

ఏలూరు నగరంలోని ఎంఆర్‌సి కాలనీకి చెందిన జక్కుల రత్నగ్రేస్ (22) స్థానికంగా తల్లిదండ్రులతో కలిసి జీవిస్తోంది. ప్రస్తుతం సిద్ధార్థ ఇంటర్మీడియట్ కళాశాలలో ఫ్యాకల్టీగా పని చేస్తోంది. అదే కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్న మరో వ్యక్తితో రత్నగ్రేస్‌కు ఈ నెల 26న నిశ్చితార్థమైంది. అయితే గ్రేస్ వెంట కొంతకాలంగా మండల కేంద్రమైన ముసునూరుకు చెందిన తొట్టిబోయిన ఏసురత్నం (23) ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతున్నాడు. యువతి ఆ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు తమ కుమార్తె జోలికి రావొద్దని హెచ్చరించారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం రత్నగ్రేస్ బ్యాంకు పనిపై ఇంటి నుంచి బయటికి వచ్చింది. అప్పటికే ఆ ప్రాంతంలో మాటువేసి ఉన్న ఏసురత్నం ఒక్కసారిగా రత్నగ్రేస్‌పై దాడి చేసి విచక్షణారహితంగా పీక కోసేశాడు. దీంతో రక్తపుమడుగులో రత్నగ్రేస్ గిలగిలాకొట్టుకుంటూ ప్రాణాలు విడిచింది. వెంటనే ఏసురత్నం పీక కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న ఏసురత్నాన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. రత్నగ్రేస్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరు త్రీటౌన్ సిఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐద్వా ఖండన

ఏలూరు అర్బన్: సత్రంపాడులో రత్నగ్రేస్ అనే యువతి గొంతు కోసి హత్య చేయడాన్ని ఐద్వా ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి తీవ్రంగా ఖండించారు. గురువారం సాయంత్రం ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో రాణి మాట్లాడారు. రోజురోజుకీ మహిళలపై వేధింపులు, దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చదువుకునే యువతులపై ప్రేమోన్మాదులు చెలరేగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు సినిమా, టీవీ, ఇంటర్నెట్‌పై నియంత్రణ విధించాలని, అశ్లీలత, హింస లేకుండా నిరోధించాలని ఆమె డిమాండ్ చేశారు. రత్నగ్రేస్ కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జి.శారద, పి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు కట్టుదిట్టమైన భద్రత

పోలవరం రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ

ప్రజాశక్తి - టి.నరసాపురం

పోలవరం నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ, ఎంపీ అభ్యర్థుల ఓట్ల లెక్కింపునకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ తెలిపారు. జూన్ 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో గురువారం ఆయన మాట్లాడారు. ఈ నెల 13న పోలవరం నియోజకవర్గంలో జరిగిన ఎంఎల్‌ఎ, ఎంపీ అభ్యర్థుల ఓటింగ్ పూర్తయిన వెంటనే మూడంచెల కట్టుదిట్టమైన భద్రత నడుమ ఇవిఎంలను ఏలూరు సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజీకి తరలించి, స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపర్చామన్నారు. నియోజకవర్గంలో మొత్తం 284 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఇవిఎంలు డివైడ్ చేసి ఎంఎల్‌ఎకు 14, ఎంపీలకు 14 టేబుల్స్ మొత్తం 28 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. లెక్కింపులో ప్రతి టేబుల్‌కు సూపర్‌వైజర్, గెజిటెడ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ మొత్తం 120 మంది సిబ్బంది హాలులో ఉంటారని తెలిపారు. ఉదయం 8 గంటలకు మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభిస్తారన్నారు. ఉదయం 8.30 నుంచి ఇవిఎంల లెక్కింపు ప్రారంభిస్తామని తెలిపారు.



మొత్తం 21 రౌండ్లలో లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటిస్తామన్నారు. లెక్కింపు సిబ్బంది ఉదయం ఐదు గంటల్లోపు లెక్కింపు కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఉదయం ఏడు గంటల్లోపు అభ్యర్థులు, వారి ఏజెంట్, కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ హాలు వద్దకు చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా వారిని లోనికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. కౌంటింగ్ ఏజెంట్లు ముందుగా ఫారం-18 నింపి రిటర్నింగ్ అధికారి ద్వారా ఐడి కార్డు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ హాలులోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదని, కేవలం పెన్ను, పేపర్ మాత్రమే అనుమతిస్తారన్నారు. ఓట్ల లెక్కింపు వివరాలు రౌండ్ల వారీగా ఎప్పటికప్పుడు ప్రతి రౌండ్‌కూ ఆర్‌ఒ నిర్ధారించి తరువాత మీడియా పాయింట్‌లో ప్రదర్శిస్తారని, ఆన్‌లైన్‌లోనూ అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. కౌంటింగ్ సమయంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లపై అభ్యంతరాలు తెలిపితే కౌంటింగ్ ముగిశాక వాటిని పరిశీలిస్తామన్నారు. ఏజెంట్లు, అభ్యర్థులు ఎవరైనా కౌంటింగ్‌కు అసౌకర్యం కలిగిస్తే వెంటనే వారిని హాలు నుండి బయటకు పంపించి వేస్తారన్నారు. కౌంటింగ్ సాఫీగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు.

చిట్‌చాట్

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై అవగాహన తప్పనిసరి

శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు అనుసరించి పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియను ఎటువంటి పొరపాట్లకూ తావులేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియపై అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై సంబంధిత అధికారులకు ఏవిధమైన అవగాహన ఉందో తెలుసుకునేందుకు కలెక్టర్ పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ ఫారం-13సి, ఫారం-13ఎ, ఫారం-13బిలకు సంబంధించిన అంశాలను వివరించారు. వాటిపై సంపూర్ణ అవగాహన తప్పనిసరన్నారు. పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓటర్లకు సంబంధించి బ్యాలెట్ల లెక్కింపులో పూర్తి జాగ్రత్త వహించి మార్గదర్శకాలకు అనుగుణంగా లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎలాంటి సొంత ఆలోచనలకూ తావీయకుండా ఎన్నికల నిబంధనలను విధిగా పాటించి ఓట్ల లెక్కింపు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ డి.పుష్పమణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.బాబ్జి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్‌ఎస్‌కె.ఖాజావలీ, సర్వశిక్షా అభియాన్ ఎపిసి బి.సోమశేఖర్, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు

ఎస్‌పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఎన్నికల ఫలితాలపై ఎటువంటి అసభ్యకరమైన పోస్టులు పెట్టిన, విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఆయా సందేశాలను ప్రచురించే గ్రూపుల అడ్మిన్‌లపై చర్యలు తీసుకుంటామని ఎస్‌పి మేరీప్రశాంతి చెప్పారు. ఈ మేరకు ఆమె గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలు ముగిశాయని, ప్రస్తుతం వాట్సాప్‌లలో, సోషల్ మీడియాల ద్వారా పలు రకాలైన విద్వేషాలను రెచ్చగొట్టే సందేశాలు, ఫొటోలు కొందరు ఆకతాయిలు ప్రచురిస్తున్నారన్నారు. అటువంటి సందేశాలు ప్రచురితమైతే కచ్చితంగా ఆ గ్రూప్ అడ్మిన్ బాధ్యత వహించాలని, తదుపరి చర్యల్లో భాగంగా గ్రూప్ అడ్మిన్‌లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రూప్ అడ్మిన్లే పూర్తి బాధ్యత వహించాలని పేర్కొన్నారు.

ఇవిఎంలకు పటిష్ట భద్రత

జెసి, ఆర్‌ఒ లావణ్యవేణి

ప్రజాశక్తి - ఏలూరు

దెందులూరు నియోజకవర్గ ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను జిల్లా జాయింట్ కలెక్టర్, ఆ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి గురువారం పరిశీలించారు. ఏలూరులోని సర్ సిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇవిఎంల స్ట్రాంగ్ రూమ్‌ను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా లావణ్య వేణి మాట్లాడుతూ ఇవిఎంల భద్రత అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇవిఎంలకు ప్రభుత్వం మూడు అంచెల భద్రత కల్పించిందన్నారు. తలుపులకు వేసిన తాళాలను, తాళాలకు ఉన్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని చోట్లా సీసీ కెమెరాలు పరిశీలించారు. తనిఖీ అనంతరం సందర్శకుల రిజిస్టర్‌లో ఆమె సంతకం చేశారు. మూడంచెలు గల కేంద్ర పోలీసు బలగాల గార్డును, జిల్లా ఆర్మ్డ్ పోలీసు గార్డు, సివిల్ పోలీసు బందోబస్తులను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఇక్కడి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని విధాలుగా జాగ్రత్తలు వహించాలన్నారు. ఇవిఎం కంట్రోల్ రూంను పరిశీలించారు. ఆమెతో పాటు అదనపు ఎస్‌పి స్వరూపరాణి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్‌ఎస్‌కె.ఖాజావలీ, నియోజకవర్గ రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఐక్యత-పోరాటమే సిఐటియు నినాదం

ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఐక్యత- పోరాటం అనే నినాదంతో సిఐటియు పని చేస్తుందని పలువురు నాయకులు అన్నారు. సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏలూరులోని సిఐటియు జిల్లా కార్యాలయం అల్లూరు సత్యనారాయణ భవనం వద్ద సిఐటియు జెండా సంఘం జిల్లా నాయకులు కె.విజయలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్.సుందరయ్య, నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు మాట్లాడుతూ సిఐటియు 1970 మే 30న ఏర్పడిందన్నారు. ఈ 54 ఏళ్ల కాలంలో అనేక చారిత్రాత్మకమైన పోరాటాలు నిర్వహించిందన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. అంగన్వాడీ, ఆశ, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అనేక పోరాటాలు నిర్వహించారన్నారు. కార్మికులకు ఏ సమస్య వచ్చినా ముందుండి పోరాటం చేసేది సిఐటియు సంఘమే అన్నారు. రానున్న కాలంలో ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు అనేక పోరాటాలు ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు బి.జగన్నాధరావు, మెడికల్ రిప్రజెంటివ్స్ యూనియన్ నాయకులు వివిఎన్.ప్రసాద్, మొహిద్దిన్, శ్రీనివాస్, అరుణ కుమారి, జె.గోపీ, ఆర్‌టిసి నాయకులు సురేష్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండల కేంద్రమైన కొయ్యలగూడెంలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. రైస్‌మిల్లు వద్ద, జంగారెడ్డిగూడెం రోడ్డులో, కొయ్యలగూడెం ప్రాథమిక ఆసుపత్రి దగ్గరలో సిఐటియు కార్యాలయం వద్ద, కొయ్యలగూడెం సెంటర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. జెండా ఆవిష్కరణ అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ సిఐటియు ఏర్పడి ఈ రోజుకు 54 ఏళ్లయిందని, ఎన్నో విజయలు సిఐటియు ద్వారా సాధించామని చెప్పారు. 1970లో బెంగాల్‌లోనే కలకత్తా నగరంలో మే 30న సిఐటియు ఆవిర్భవించిందని తెలిపారు. త్యాగం, పోరాటం నినాదంతో 54 ఏళ్లుగా కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు సిఐటియు నిర్వహిస్తుందని చెప్పారు. ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వ సంస్థలను కాపాడాలని సిఐటియు పోరాటం నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశాలు, విఒఎలు, ఆటో, హమాలీ, మిడ్డే మీల్, స్కూల్ స్వీపర్ భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



ఏలూరులో...

చింతలపూడి : 54 ఏళ్ల కాలంలో సిఐటియు ఏర్పడిన దగ్గర నుంచి కార్మిక హక్కులకు అనేక పోరాటాలు జరిపి అనేక విజయాలు సాధించిందని సిఐటియు మండలాధ్యక్షులు సిహెచ్.శాంతిశ్రీ అన్నారు. మండలంలోని ఫ్యాక్టరీ గేటు వద్ద యూనియన్ నాయకులు పి.బాలకృష్ణ సిఐటియు జెండా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో శాంతిశ్రీ మాట్లాడుతూ కార్మికులకు ఎక్కడ ఆపద జరిగినా సిఐటియు అక్కడ ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకూ పోరాడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ యూనియన్ కార్యదర్శి పి.పెద్దిరాజు పాల్గొన్నారు.

కనీస వేతనం, కార్మిక హక్కులకై ఉద్యమిద్దాం

చింతలపూడి ఫైర్ స్టేషన్ సెంటర్‌లో సిఐటియు మండలాధ్యక్ష కార్యదర్శులు నత్తా వెంకటేశ్వరరావు, బాలరాజు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు సూర్యకుమార్, ఆర్‌విఎస్.నారాయణ మాట్లాడుతూ ఐక్యత-పోరాటం నినాదంతో 1970, మే 30న ఏర్పడిన సిఐటియు దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్ట్ నాయకులు సరోజిని, మాణిక్యం, సరళ, సెక్టార్ లీడర్స్ అరుణ, చెన్నకేశ్వరి, ఆశ యూనియన్ నాయకులు సరళ, అశ్వని, మెప్మా యూనియన్ నుంచి ఝాన్సీ, కృష్ణవేణి, రవాణా రంగం నుంచి మధు, జయరాజు కృష్ణ, యూనియన్ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ముసునూరు : నూజివీడు పట్టణంలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు నాయకులు జి.రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు దుర్గారావు, కుమార్, రాంబాబు, సంసోను, రవి, పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమించే యూనియన్ సిఐటియు అని ఆగిరిపల్లి మండల కార్యదర్శి రాజులపాటి చంటి అన్నారు. ఆగిరిపల్లి సిఐటియు కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో సిఐటియు జెండాను సిపిఎం మండల కార్యదర్శి చాకిరి శివ నాగరాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.సుభాకర్, ఎస్‌కె.జహాంగీర్ బాషా, ఎం.నరేష్, ఎస్.కోటేశ్వరరావు, జె.రమేష్ పాల్గొన్నారు.

భీమడోలు : మండలంలోని పలు గ్రామాల్లో సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పూళ్ల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి సిఐటియు నాయకులు అప్పారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బెండి శ్రీనివాస్‌తో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


భీమడోలులో...

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ఏలూరు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకరరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన మొదటి సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు మొత్తం 3,592 మందికి 3,124 మంది హాజరు కాగా 468 మంది గైర్హాజరయ్యారు. 87 శాతం హాజరు నమోదైంది. ఇందులో సాధారణ విద్యార్థులు 2,732 మందికి 2,459 మంది హాజరు కాగా 273 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్య విభాగంలో 860 మందికి 665 మంది హాజరు కాగా 195 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు జరిగిన ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు మొత్తం 1,049 మందికి 906 మంది హాజరు కాగా 143 మంది గైర్హాజరయ్యారు. 86 శాతం హాజరు నమోదైంది. ఇందులో సాధారణ విద్యార్థులు 736 మందికి 657 మంది హాజరు కాగా 79 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా విభాగంలో 313 మందికి 249 మంది హాజరు కాగా 64 మంది గైర్హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ప్రభాకరరావు తెలిపారు.

ప్రశాంతంగా పది సప్లిమెంటరీ పరీక్ష

ఏలూరు సిటీ : జిల్లావ్యాప్తంగా సోమవారం జరిగిన పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ భౌతికశాస్త్ర పరీక్షకు 8289 విద్యార్థులకుగాను 4299 మంది హాజరయ్యారని, 3990 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో రోజు మొత్తం 15 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పేర్కొన్నారు.

పరీక్షకు 129 గైర్హాజరు

పోలవరం : పోలవరం మండలంలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షకు 129 మంది గైర్హాజరైనట్లు ఉపాధ్యాయులు వి.సూర్యనారాయణమూర్తి తెలిపారు. 211 మంది విద్యార్థులకు 82 మంది హాజరయ్యారని 129 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

రోడ్డుపై కూలిన భారీ వృక్షం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని బొమ్మినంపాడు శివారు జానికిగూడెం దగ్గర గురువారం భారీ వృక్షం రోడ్డుపై కూలింది. దీంతో ఆ రోడ్డుపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. భీమవరం-విజయవాడ ప్రధాన రోడ్డు కావడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై అడ్డంగా పడి ఉన్న భారీ వృక్షాన్ని జెసిబి సాయంతో తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలు తిరిగి యధావిధిగా కొనసాగాయి.


వృక్షాన్ని తొలగిస్తున్న జెసిబి


పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు పవర్‌పేటలోని హిందీ నికేతన్ వజ్రోత్సవ సంవత్సర కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు గురువారం పర్యావరణ పరిరక్షణ అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హిందీ నికేతన్ కార్యదర్శి పి.కవితాకుమారి, అధ్యక్షులు వి.వెంకటస్వామి మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణం పట్ల అవగాహన కల్పించి, కాలుష్య నివారణలో విద్యార్థులను భాగస్వాములను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హిందీ నికేతన్ యాజమాన్యం వారు మరిన్ని కార్యక్రమాల్లో నిర్వహిస్తారని, దానిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మాతృదేవోభవ సంస్థ కార్యదర్శి కూచిపూడి సత్యనారాయణ మాట్లాడుతూ చిత్రలేఖన పోటీల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని, మంచి ఆలోచనా శక్తి సాధ్యమవుతుందని, విద్యార్థులు అన్ని రకాల పోటీలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. చిత్రలేఖన పోటీల్లో మొత్తం 46 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను వరుసగా సిహెచ్.తాన్యనాగ్, పి.సందీప, పిఎస్ఎస్.నీలేష్ గెలుచుకోగా, ప్రోత్సాహక పురస్కారాలను ఎం.నెహర్‌సాయి, పి.వినోద్ గెలుచుకున్నారు. చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికి ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు.

టిడిపి నేత నరసింహారావు మృతి

ప్రజాశక్తి - కలిదిండి


మృతదేహానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

టిడిపి సీనియర్ నేత, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ పోకల నరసింహారావు (84) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మండలంలోని భాస్కరరావు పేటలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. చిన్న నాటి నుంచి రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ 1971 నుంచి 1987 వరకు భాస్కరరావు పేట సర్పంచ్‌గా 18 ఏళ్ళు, పెదలంక కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులుగా 1986 నుంచి 1988 వరకు, 2000 నుంచి 2002 వరకు టిడిపి మండలాధ్యక్షునిగా, 2003- 2004 మధ్యకాలంలో కలిదిండి మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా ఆయన పనిచేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన కుమారుడు జోగిరాజు మండలాధ్యక్షునిగా ఉన్నారు. నరసింహారావు మృతదేహాన్ని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, ఎంఎల్ఏ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎంఎల్ఏ కమ్మిలి విఠల్, టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంజ్రు శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్లు వల్లభనేని శ్రీనివాస్‌చౌదరి, నంబూరి వెంకటరామరాజు, నున్న వెంకటేశ్వరరావు, నాయకులు బికెఎం.నాని, కొడాలి వినోద్, సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, కార్యకర్తలు వీరవల్లి భాస్కరరావు, దొంగ వెంకటసత్యనారాయణ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

పారిశుధ్య కార్మికులపై వేధింపులు ఆపాలి

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు నగర కార్పొరేషన్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులపై వేధింపులు మానుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా కార్యదర్శి బలంతి శ్రీనివాస్ హెచ్చరించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు నగర కార్యవర్గ సమావేశం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో వై.శివకుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బలంతి శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో ప్రజారోగ్య విభాగంలో 17 సర్కిల్ కార్యాలయాల్లో 800 మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. నగర పాలక సంస్థలో విలీనమైన ఏడు గ్రామ పంచాయతీలకు సంబంధించిన కార్మికుల పట్ల కొంతమంది శానిటరీ సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, అప్పటికీ పరిష్కారం కాకపోతే యూనియన్ పక్షాన పోరాటాలు, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

'పింఛన్లు వాలంటీర్ల ద్వారా ఇవ్వాలి'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో ఎన్నికలు పూర్తయిన కారణంగా వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ఇచ్చే పింఛన్లను బ్యాంకుల ద్వారా కాకుండా వాలంటీర్ల ద్వారా గాని, సచివాలయం ద్వారా గాని ఇచ్చేందుకు రాష్ట్ర ఎన్నికల అధికారి చర్యలు తీసుకోవాలని బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మే ఒకటో తేదీన బ్యాంకుల ద్వారా పెన్షన్ ఇవ్వడం వల్ల అనేకమంది వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు పూర్తయిన కారణంగా పెన్షన్లను బ్యాంకుల ద్వారా కాకుండా వాలంటీర్ల ద్వారా ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని వెంకటేశ్వరరావు కోరారు.

క్రమశిక్షణ, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం

మోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయబాబు

ప్రజాశక్తి - కామవరపుకోట


విజయబాబు

మండలంలోని ఆడమిల్లి గ్రామం శివారులో సుమారు రూ.12 కోట్ల రూసా నిధులతో నిర్మించిన మోడల్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో క్రమశిక్షణతో విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. 2020లో ప్రధాని నరేంద్ర మోడీ వర్చ్యువల్ పద్ధతిలో ఆడమిల్లి శివారులో ఈ నూతన క్యాంపస్‌ను ప్రారంభించారన్నారు. అంతకుముందు 2008 నుంచి కామవరపుకోటలోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల క్యాంపస్‌లో తరగతులు నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న నాలుగు మోడల్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో తమ కళాశాల ఒకటని చెప్పారు. తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని చెప్పారు. మొత్తం కళాశాల నిర్మాణం కోసం ప్రభుత్వం 10.60 ఎకరాల స్థలాన్ని ఆడమిల్లి గ్రామంలో కేటాయించిందన్నారు. ఈ స్థలంలో విశాలమైన నూతన భవనాలు నిర్మించి బిఎస్‌సి, బికామ్, బిఎ కోర్సులను అందిస్తున్నామన్నారు. కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఆధునిక ప్రయోగశాలలు, జెకెసి, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీ, రీడింగ్ రూమ్‌లు, సెమినార్ హాల్, వర్చ్యువల్ డిజిటల్ తరగతి గదులు, లేడీస్ వెయిటింగ్ హాల్, వాటర్, టాయిలెట్స్, క్యాంటీన్ సదుపాయం కల్పించామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థినుల సౌకర్యార్థం ప్రత్యేకమైన హాస్టల్‌ను ప్రారంభించామని తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థినులకు కావాల్సిన బెడ్స్‌తో పాటు అని రకాల వసతులను కల్పించామన్నారు. తమ కాలేజీలో క్రమశిక్షణ, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని విద్యాబోధన చేస్తున్నామన్నారు. సెమినార్ల నిర్వహణ, పోటీ పరీక్షలకు ప్రత్యేకమైన శిక్షణ, ఫీల్డ్ విజిట్‌లు, స్పోర్ట్స్, కల్చరల్ యాక్టివిటీస్, ఎన్ఎస్ఎస్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు, కాలేజీలో చిత వైఫై సదుపాయం అందుబాటులో ఉందని చెప్పారు. కాలేజీలో చదివే విద్యార్థినుల కోసం ప్రత్యేక ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఉందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల స్కీమ్స్, స్కాలర్‌షిప్ సదుపాయం ఉందన్నారు. కళాశాలలో ప్రిన్సిపల్ సహా మొత్తం తొమ్మిది మంది ఉన్నత విద్య అర్హతలు, అకింతభావం గల అధ్యాపకుల బృందం ఉందని తెలిపారు. వీరిలో పిహెచ్‌డి చేసిన అధ్యాపకులు ముగ్గురు ఉన్నారన్నారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందిస్తున్న నాణ్యమైన ఉచిత విద్యను విద్యార్థులందరూ వినియోగించుకోవాలని కోరారు.



మోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పేద విద్యార్థుల కల్పవల్లి మమత స్కూల్

ప్రిన్సిపల్ మమతారాజ్, డైరెక్టర్ రాజు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్


మమతారాజ్


రాజు

మమత స్కూల్ పేద విద్యార్థుల కల్పవల్లిగా ఉందని ప్రిన్సిపల్ మమతారాజ్, డైరెక్టర్ ఎస్.ఎస్.రాజు తెలిపారు. మమత స్కూల్‌ను 2009లో స్థాపించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. దాదాపు 20 ఏళ్ల సుదీర్ఘ అనుభవం, అర్హతలతో పిల్లలను బడిలో చేర్పించడానికి మొదట్లో చాలా కష్టపడ్డామన్నారు. అప్పటికే 12 కిలోమీటర్ల పరిధిలో పది ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు వెళ్లనుకున్నాయన్నారు. అయినా పట్టు వదలకుండా ఒక పక్క పాఠశాలలో అతి తక్కువ ఫీజులతో కొనసాగిస్తూనే విద్యా ప్రమాణాలు పెంచుకుంటూపోవడంతో చుట్టుపక్కల ప్రజల విశ్వాసాన్ని చురగొన్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్నారన్నారు. కొల్లేరు పరిసర గ్రామాల నుంచి పిల్లలను చేర్పించండని తల్లిదండ్రులను మెప్పించడానికి ఎంతగానో శ్రమించిన అనంతరం మొదటి ఏడాదిలోనే గణనీయమైన విద్యార్థుల సంఖ్యతో మొదలై ఇప్పటికీ వందల సంఖ్యలో పొరుగు స్కూల్స్‌కు గట్టి పోటీ ఇచ్చిందనడంలో మమత స్కూల్‌కి సాటి లేదని వారు చెప్పారు. ప్రస్తుతం కొల్లేరు లంకలు, చాటపర్రు, పరిసర గ్రామాల నుంచి విద్యార్థులు తమ పాఠశాలకు వస్తున్నారన్నారు. పల్లెటూరు విద్యార్థుల సత్తా ఏమిటో బయట నిర్వహించిన అన్ని సందర్భాల్లో పోటీల్లో పాల్గొని మట్టిలో మాణిక్యాల వలే అన్నింటా వీరే ముందు ఉండటం గొప్ప విషయమన్నారు. స్కూల్ యాజమాన్యం, సిబ్బంది చక్కటి అనుబంధంతోనే ఇన్ని విజయాలు మా సొంతమన్నారు. యాజమాన్యం నుంచి గత 15 ఏళ్లుగా వీధి బాలలకు ఉచిత విద్య, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, బట్టలు, బూట్లు సర్వం ఉచితంగా అందిస్తూ సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. చిత్తు కాగితలు ఏరుకునే వారి పిల్లలకు అన్ని సమకూర్చి చక్కని చదువు అందిస్తున్నామన్నారు. పాఠశాలలో ఉన్న చిన్నారులకు వారి ఆరోగ్యం దృష్ట్యా ఆది నుంచి మినరల్ వాటర్ అందిస్తూ, పిల్లల విషయంలో ఖర్చుకు వెనుకాడకుండా అన్ని విషయాల్లో ముందుకు వెళ్లడంతో తల్లిదండ్రుల హృదయాల్లో చక్కటి స్థానం పొందామన్నారు. పల్లెటూరు అని తక్కువగా భావించకుండా, చిన్నారులకు ఎసి రూమ్‌లో డిజిటల్ క్లాస్ ఏర్పాటు చేసి వారికి టెక్నాలజీతో పరుగెడుతున్న డిజిటల్ ప్రపంచాన్ని పరిచయం చేస్తూ కార్పొరేట్ స్కూల్స్‌కు పోటీ ఇవ్వడం కూడా తమ విజయానికి ఓ మెట్టు అని చెప్పారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని తెలియజేయడానికి అన్ని కుల మతాలను గౌరవిస్తూ అన్ని పండుగలను గౌరవిస్తూ సెలబ్రేషన్స్ చేయడం ద్వారా తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయడం కూడా మరింత దృష్టిని కలిగిస్తుందన్నారు. 2024-2025 విద్యా సంవత్సరానికి ఉన్నత పాఠశాలకు అనుమతి లభించిందని, తద్వారా మొదటి పదో తరగతి బ్యాచ్ పరీక్షలకు వెళ్తున్నారని తెలిపారు. గత నాలుగేళ్లుగా హేలాపురి బాలోత్సవం వారు నిర్వహించిన పోటీల్లో 15 మండలాలు, పది వేల మంది పిల్లలు పోటీల్లో ఆటపాటలు, చదువులు, సాంస్కృతిక పోటీల్లో పాల్గొంటే ప్రతి ఏడాది ప్రథమ స్థానాల్లో నిలబడి అన్ని పోటీల్లో మమత స్కూల్ విద్యార్థులే గెలుపు గుర్రాల్లా పోటీ పడి గెలుపొందారని తెలిపారు.

ఉన్నత విలువలు, నాణ్యమైన విద్యే లక్ష్యం

పంగిడిగూడెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.సురేష్



పంగిడిగూడెం జెడ్‌పి హైస్కూల్


హెచ్‌ఎం సురేష్


హేమంబరి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని పంగిడిగూడెం హైస్కూల్ ఉన్నత విలువలు, నాణ్యమైన విద్య అందిస్తూ ముందుకు సాగుతుందని ప్రధానోపాధ్యాయులు పి.సురేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. 1992 నుంచి పంగిడిగూడెం పాఠశాల హైస్కూల్‌గా మార్చినట్లు చెప్పారు. 2023-2024 విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో 68 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కె.హేమాంబరి 548 మార్కులతో స్కూల్ ప్రథమంగా నిలిచిందని తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 90 మంది విద్యార్థులు తొమ్మిదో తరగతి నుంచి పదో తరగతి ప్రమోట్ అయ్యారని తెలిపారు. ఈ సంవత్సరం నుంచి ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు సిబిఎస్‌ఇ సెంట్రల్ సిలబస్ అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు వీ లవ్ రీడింగ్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం స్కూల్‌లో 17 మంది ఉపాధ్యాయులు ఉన్నారని, ఉన్నత విలువలు, నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. స్కూల్‌లో పిల్లలు ఆడుకునేందుకు విశాలమైన గ్రౌండ్ సదుపాయం ఉందని, నాడు-నేడు పథకంలో భాగంగా అదనపు తరగతులు నిర్మించారని, విద్యార్థులకు అథర్ యాక్టివిటీస్ అయిన స్పోర్ట్స్ విభాగంలో పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరుసున్నారని తెలిపారు. నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు గమనించి వారి పిల్లలను గవర్నమెంట్ స్కూల్లో చేర్పించి వారి అభ్యున్నతికి తోడ్పడాలని తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని గ్రంథ పాలకులు ఆర్.కిషోర్ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే పుస్తకం పఠనం అలవర్చుకోవాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి వేసవి విజ్ఞాన శిబిరాలు దోహదపడతాయని ఆయన తెలిపారు.

'ఆరోగ్య సురక్ష'ను వినియోగించుకోండి

ఏలూరు టౌన్ : ఏలూరు నగర పరిధిలో ప్రతి గురువారం జరిగే ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య సేవలను నగర ప్రజలు వినియోగించుకోవాలని మున్సిపల్ అడిషనల్ కమిషనర్ వి.చంద్రయ్య సూచించారు. స్థానిక ఏలూరు పట్టణ ఆరోగ్య కేంద్రం గజ్జిలవారిచెరువులో జరుగుతున్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. వైద్య సిబ్బంది అందరూ ఆరోగ్య సురక్ష ద్వారా లభిస్తున్న ఉచిత వైద్య సేవల గురించి ప్రజలందరికీ వివరించాలన్నారు. ఈ శిబిరంలో ప్రముఖవైద్యులు లెప్రస్కోపిక్ సర్జన్ కె.విశ్వేశ్వరావు, చైత్ర హాస్పిటల్ ఆర్థోపెడిషన్ వైద్యులు పాల్గొని రోగులను పరీక్షించి, ఉచిత మందులు అందించారు. మున్సిపల్ అడిషనల్ కమిషనర్ వి.చంద్రయ్య రోగులతో మాట్లాడి వారికి ఇచ్చిన మందులను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పన్నుల వసూలును ప్రయివేటుకు అప్పగించడం తగదు

సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పన్నుల వసూలు పనిని ప్రయివేట్ ఏజెన్సీకి అప్పగించాలనే నిర్ణయం ఉపసంహరించుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ డిమాండ్ చేశారు. సిపిఎం కార్యాలయంలో సిపిఎం నగర కమిటీ సమావేశం కె.రామాంజనేయులు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పన్నుల వసూళ్ల బాధ్యత ప్రయివేట్ ఏజెన్సీకి అప్పగిస్తున్నట్లు వివిధ పత్రికల్లో వార్తలు వచ్చాయన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ కూడా పన్నుల విధింపు, పన్నుల వసూళ్ల వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపినట్లు వార్తలొచ్చాయన్నారు. మున్సిపాలిటీలో పన్నులు వసూలు చేయడానికి తగిన సిబ్బంది ఉద్యోగులు ఉన్నారని, ఏలూరులో దాదాపు 80 సచివాలయాలు, వాటిలో పనిచేస్తున్న వందలాది సిబ్బంది, ఉద్యోగులు ఉన్నారన్నారు. పన్నుల వసూళ్లు వారి ద్వారా చేయించవచ్చన్నారు. అలా కాకుండా వసూలు చేసిన డబ్బుల్లో పది శాతం కమిషన్‌ను ఒక ప్రయివేట్ ఏజెన్సీకి ఇస్తూ, ఆ ప్రక్రియ అంతా అప్పగించడమంటే దీని వెనుక చాలా పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం జరిగే సమావేశంలో ఈ పన్నుల వసూళ్లను ప్రయివేట్ ఏజెన్సీకి అప్పగించేందుకు తీర్మానం చేయడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తుందన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందని, విధానపర నిర్ణయాలు ఏవీ తీసుకోరాదని అటువంటి సమయంలో కమిషనర్ దీనిపై సర్క్యులర్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ప్రయివేట్ ఏజెన్సీలు సక్రమంగా పని చేస్తాయని నమ్మకం ఏంటని ప్రశ్నించారు. దీనివల్ల మున్సిపాలిటీకి వస్తున్న ఆదాయం కూడా పది శాతం తగ్గుతుందన్నారు. ఇటువంటి అనాలోచిత నిర్ణయాలు విరమించుకోవాలని హితవు పలికారు. లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు వి.సాయిబాబు, బి.జగన్నాథం, వివివిఎన్.ప్రసాద్, జి.రవికిషోర్, వైఎస్.కనకారావు, హైమా, ఎం.అరుణకుమారి పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వచ్చే నెల నాలుగో తేదీన జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో భాగంగా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కల్గించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని నూజివీడు గ్రామీణ సిఐ కె.రామకృష్ణ హెచ్చరించారు. మండల పరిధిలోని ఈదర గ్రామంలో గ్రామస్తులకు ఆయన ఓట్ల లెక్కింపు సందర్భంగా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి.సురేంద్రకుమార్, ఎఎస్ఐ తప్లీర్‌నాయక్ పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు చెల్లించకపోతే ఆందోళనలు

రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రబీ ధాన్యం బకాయిలు చెల్లించకపోతే ఆందోళనలు చేపడతామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ హెచ్చరించారు. ఏలూరు పవర్‌పేటలోని అన్నే భవనంలో రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. జిల్లాలోని పలు రైతాంగ సమస్యలు చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రబీ ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు అమ్మి నెల రోజులు దాటిపోతున్నా ధాన్యం బకాయి సొమ్ములను చెల్లించకపోవడం దారుణమని విమర్శించారు. ధాన్యం డబ్బులు చేతి కందక అప్పులకు వడ్డీలు పెరిగిపోయి కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు రెండు మూడు రోజులకే ధాన్యం డబ్బులు చెల్లించిన ప్రభుత్వం ఎన్నికల తర్వాత పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. రైతులకు, కౌలు రైతులకు చెల్లించాల్సిన బకాయి సొమ్ముల నిధులు విడుదల చేసి రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని, లేకపోతే ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కృష్ణా, గోదావరి డెల్టాల పంట కాలువలను ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. గుర్రపు డెక్క, తూడు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అందుకు తగిన నిధులు విడుదల చేయాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు పూర్తిస్థాయిలో అందలేదని, జీలుగ విత్తనాల కోసం ఆర్‌బికె కేంద్రాల చుట్టూ రైతులు తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు అందించాలని కోరారు. ఖరీఫ్ సాగుకు 90 శాతం రాయితీతో విత్తనాలు అందించాలని కోరారు. రైతులకు, ప్రజలకు నష్టదాయకంగా ఉన్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలన్నారు. ఈ చట్టం ద్వారా రైతులు తమ భూములపై హక్కులు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు నీతి అయోగ్ రూపొందించిన చట్టాన్ని దేశంలో మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసి రైతులు, ప్రజల రాజ్యాంగ హక్కులను కాలరాసే దుర్మార్గ చర్యలను అందరూ ఖండించాలని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసే వరకు రైతాంగం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, కోనా శ్రీనివాసరావు, గుండపనేని సురేష్, వాడపల్లి రామారావు, పి.రాంబాబు పాల్గొన్నారు.

ప్రగడవరంలో ఉపాధి హామీ పనులు

ప్రజాశక్తి - చింతలపూడి

గతంలో లేని విధంగా ఉపాధి హామీ పనులను ప్రగడవరం గ్రామస్తులు వినియోగించుకుంటున్నారని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వరావు తెలిపారు. ప్రతి రోజు 1500 మంది ఉపాధి హామీ పనికి వెళ్తున్నారన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

నిరుపేద వ్యక్తి అంత్యక్రియ ఖర్చులకు అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి గురువారం ఆర్థిక సాయం అందించారు. ముదినేపల్లికి చెందిన కె.సాంబశివరావు(35) ముఠామేస్త్రిగా పని చేస్తుంటాడు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అంబుల వైష్ణవి, తండ్రి ప్రముఖ వైద్యులు మనోజ్‌తో కలిసి వెళ్లి సాంబశివరావు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియలు చేసే నిమిత్తం రూ.ఐదు వేలు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. మృతుడు సాంబశివరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

త్వరలో పూర్తిస్థాయి కమిటీలు

కాపు సంక్షేమ సేవాసంఘం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో, 25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో, రాష్ట్రస్థాయిలో త్వరలోనే పూర్తిస్థాయి కమిటీలను నియమిస్తామని కాపు సంక్షేమ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీరాములు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల వారు ఇంటిపేరుతో సహా వారి పూర్తి పేరు, చిరునామా, ఆధార్ కార్డు తో సహా 7989218336 వాట్సాప్‌లో పంపాలని పులి శ్రీరాములు కోరారు.

అసెంబ్లీ అధ్యక్షునిగా రాజు

కాపుసంక్షేమ సేవాసంఘం ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షునిగా వాసా రాజు నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవస్థాపక అధ్యక్షులు పులి శ్రీరాములు ఉత్తర్వులు జారీ చేశారు.

నేరాలు - ఘోరాలు

రైలు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన దెందులూరు రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన కొందరు వలస కూలీలు దెందులూరు మండలం ముప్పవరం గ్రామంలో ఉన్న నాగ హనుమాన్ రొయ్యల షెడ్డులో పని చేసేందుకు వచ్చారు. వారంతా కొంతకాలంగా ఇక్కడే పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో రతికాంత్ దాస్ (23) గురువారం ఉదయం సీతంపేట సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా రైలు అతడిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రైల్వే పోలీసులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఏలూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడు కన్పించడంలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి - టి.నరసాపురం

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రాజు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెలగపాడు పంచాయతీలోని వీరభద్రవరం గ్రామానికి చెందిన జోనుబోయిన వెంకట శివాజీ గత నెల పదో తేదీన ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. తండ్రి ధర్మయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.